క్లుప్తంగా

ఘనంగా దుర్గమ్మ పండుగ



చెన్నారావుపేట : మండలంలోని పత్తినాయక్ తండాలో గిరిజనులు మంగళవారం ఘనంగా దుర్గమ్మ పండుగ నిర్వహించారు. దుర్గమాత గుడి పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఎర్ర రాజు, కీసరి సాంబరాజు, మురహరి విజయ్, కాటి హరీష్, లవన్, పడిదం హరికృష్ణ, గణేష్, వెంకన్న, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

వేడుకగా ఎల్లమ్మ పట్నాలు



ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేట శివారులోని ఎల్లమ్మ ఆలయంలో మాడ్రాజు రేణుక వెంకన్న దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం ఎల్లమ్మ పట్నాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేపట్టారు. మొక్కులు చెల్లించుకున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

గీసుకొండ : పల్లె దవాఖాన డాక్టర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు తన కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ ప్రకాశ్, డాక్టర్ మోహన్‌సింగ్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ అర్చన, డాక్టర్ రవీందర్, డాక్టర్ విజయ్‌కుమార్, డబ్ల్యూహెచ్‌ఓ సర్వేలెన్స్ మెడికల్ ఆఫీసర్ అతుల్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ, ఎన్‌ఎంఏ అధ్యక్షుడు గుండా రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ కరపత్రాల..

నర్సంపేట : ఈనెల 20న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమ కరపత్రాలను పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) కార్యాలయంలో న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇతర హామీలు అమలు చేయకుండా 14 నెలలుగా మోసపూరిత పాలన సాగిస్తోందని ధ్వజమెత్తారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం తప్ప మిగితా ఐదు గ్యారంటీలను ఇంకా ప్రారంభించలేదని మండిపడ్డారు. హామీల అమలు, ప్రజాసమస్యల పరిష్కారం కోసం చలో హైదరాబాద్ కార్యక్రమానికి ప్రజలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్, ఏఐకేఎంఎస్, పీవైఎల్ నాయకులు భోగి సారంగపాణి, భద్రాజీ, మల్లన్న, గుగులోత్ కిషన్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

నియామకం

చెన్నారావుపేట : జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా అధికార ప్రతినిధిగా మండల కేంద్రానికి చెందిన నర్మెట్ట యాదగిరి నియమితులయ్యారు. యాదగిరికి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య మంగళవారం నియామక పత్రం అందజేశారు. అనంతరం యాదగిరి మాట్లాడారు. మానవ హక్కుల పరిరక్షణకు పాటుపడతానని చెప్పారు.

ఆయుర్వేద వైద్యుడి మృతి

నెక్కొండ : మండలంలోని పనికర గ్రామానికి చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు రామసహాయం రాంరెడ్డి (85) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. ఆయన సుమారు 5 దశాబ్దాలుగా మండల, పరిసర గ్రామాల ప్రజలకు ఆయుర్వేద వైద్యసేవలు అందిస్తున్నారు. సొంత డబ్బుతో గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయం నిర్మించారు. రాంరెడ్డి మృతదేహానికి పలువురు నివాళులర్పించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

చెన్నారావుపేట : ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఉప్పరపల్లిలో చోటుచేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన కొయ్యడి రాజు (38) బతుకు దెరువు కోసం హనుమకొండ జిల్లా ములకనూరుకు వెళ్లి అక్కడే ఉంటూ రెస్టారెంట్‌లో పని చేస్తున్నాడు. రాజు సోమవారం ఉప్పరపల్లిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబీకులు ఎంజీఎంలో చేర్పగా మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం

ఖానాపురం : మండలంలోని వేపచెట్టుతండాకు చెందిన భూక్య సరియా అనే వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఆయన 10 రోజుల క్రితం విజయవాడలోని బంధువుల ఇంటికి వెళ్లి గ్రామానికి వస్తుండగా తప్పిపోయాడు. సరియాకు చెవులు సరిగా వినపడవని, కండ్లు సరిగా కనబడవని తెలిపారు. ఆచూకి తెలిసిన వ్యక్తులు సెల్ నంబర్ 9866279418, 9866272646ల్లో సమాచారం అందించాలని కోరారు.

పోలీస్‌స్టేషన్లలో క్యూఆర్ కోడ్‌లు

- సిబ్బంది పనితీరుపై అభిప్రాయాల నమోదే లక్ష్యం
- ప్రజల్లో అవగాహనకు శ్రీకారం

ఖానాపురం : శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమన్నది జగమెరిగిన సత్యం. కానిస్టేబుల్ నుంచి మొదలుకొని ఉన్నతాధికారుల వరకు నిత్యం ప్రజలకు సేవలందించడం పరిపాటి. ఈ క్రమంలో వచ్చే ఫిర్యాదుదారుల పట్ల పోలీసుల స్పందన, అందుతున్న సేవలు ప్రస్తుతం కీలకంగా మారాయి. ప్రభుత్వం ప్రజాభిప్రాయాల ద్వారా పోలీసులు పనితీరుపై అధ్యయనానికి దృష్టి సారించింది. అన్ని పోలీస్‌స్టేషన్లలో క్యూఆర్ కోడ్ అందుబాటులోకి తీసుకొస్తోంది.

వంద పదాలకు మించకుండా అభిప్రాయం..

గూగుల్‌కు వెళ్లగానే స్కానర్ ఉంటుంది. దాని ద్వారా క్యూర్ కోడ్‌ను స్కాన్ చేసి భాష ఎంచుకోవాలి. అనంతరం పేరు, జెండర్, ఫోన్ నంబర్, ఈమెయిల్ అడుగుతుంది. ఫీడ్‌బాక్ కేటగిరీ క్లిక్ చేయాల్సి ఉంటుంది. అక్కడ పిటిషన్, ఎఫ్‌ఐఆర్,



క్యూఆర్ కోడ్‌లు ఏర్పాటు చేస్తున్న ఎస్సై (ఫైల్)

పాస్‌పోర్ట్ ధ్రువీకరణ, ఈ–చలానా ఆప్షన్లు ఉంటాయి. వాటిలో మనకు కావాల్సిన ఆప్షన్ ఎంచుకోవాలి. పోలీస్‌స్టేషన్‌కు ఎందుకు వెళ్లారో ఆప్షన్‌ను ఎంచుకోవాలి. పిటిషనర్ ఐడీ, తేదీ, పోలీస్‌స్టేషన్ పేరు ఎంచుకోవాలి. అప్పుడు ఆయా పోలీస్‌స్టేషన్లలో మీకు అందిన సేవలపై ర్యాంకింగ్ ఇవ్వాలి. అక్కడ నాలుగు ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో దానికి ఐదు రేటింగ్స్ ఉంటాయి. పోలీస్‌స్టేషన్‌లో మిమ్ములను ఎలా రిసీవ్ చేసుకున్నారు, ఫిర్యాదుపై ఎలా స్పందించారు, పోలీసులు సేవలు ఎలా అందించారు, పోలీసుల తీరుపై ఏ మేరకు సంతృప్తి చెందారనే విషయాలపై రేటింగ్స్ ఇవ్వాల్సి ఉంటుంది. అనంతరం సుమారు వంద పదాలకు మించకుండా మీ అభిప్రాయాన్ని తెలియజేసే అవకాశం ఉంది.

ముమ్మర ప్రచారానికి శ్రీకారం..

క్యూఆర్ కోడ్‌పై పెద్ద ఎత్తున ప్రచారం చేయడానికి పోలీస్‌శాఖ నిర్ణయించింది. అన్ని పోలీస్‌స్టేషన్లలో 5 చొప్పున క్యూఆర్ కోడ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను రాష్ట్ర డీజీపీ సైతం పరిశీలించే అవకాశాలున్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి

పోలీస్‌స్టేషన్లలో ఏర్పాటు చేస్తున్న క్యూఆర్ కోడ్‌లతో ఫిర్యాదుదారులు అభిప్రాయాలు నమోదు చేయవచ్చు. బాధితుల అభిప్రాయాలను ఉన్నతాధికారులు పరిశీలిస్తారు. తద్వారా పోలీసుల పనితీరును ఫిర్యాదు రూపంలోనూ తెలియజేసే అవకాశం కూడా లభిస్తుంది. క్యూఆర్ కోడ్‌ను ఫిర్యాదుదారులు సద్వినియోగం చేసుకోవాలి.

– రవీందర్, డీసీపీ, ఈస్ట్‌జోన్

అవగాహనతో క్యాన్సర్‌కు చెక్

- మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ మోహన్‌దాస్

నర్సంపేట : అవగాహన పెంచుకోవడం ద్వారా క్యాన్సర్‌కు చెక్ పెట్టొచ్చని స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్, మెడికల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ మోహన్‌దాస్ స్పష్టం చేశారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ అధ్యక్షతన జువాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి డాక్టర్ మోహన్‌దాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, వంటి కారణాలతో సమాజంలో క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతోందని చెప్పారు. క్యాన్సర్ చికిత్స విధానంలో రేడియాలజీ, కీమోథెరఫీ వంటి నూతన పద్ధతులు రావడంతో కొంత ఉపశమనం లభిస్తోందన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నవీన్ మాట్లాడుతూ క్యాన్సర్ బారిన పడడానికి గల కారణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థి



దశలోనే అవగాహన పెంచుకోవాలని సూచించారు. జువాలజీ విభాగం అధిపతి డాక్టర్ బి.గ్లోరి మాట్లాడుతూ అవగాహన లేకపోవడం వల్లే క్యాన్సర్ ప్రబలుతోందని చెప్పారు. కార్యక్రమంలో జువాలజీ విభాగ అధ్యాపకులు నిజాం, లక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి సత్యనారాయణ, అకడమిక్ కోఆర్డినేటర్ కె.సత్యనారాయణ, పరీక్షల నియంత్రణాధికారి కమలాకర్, స్టాఫ్ సెక్రటరీ సోమయ్య, ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ [illegible] తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట : మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నవీన్

దుగ్గొండి : మండల కేంద్రంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ‘గుట్కా, అంబర్ వద్దు.. ఆరోగ్యం ముద్దు’ అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆస్పత్రి నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ తీశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సలోమి, హెచ్‌ఈఓ సాంబయ్య, సంధ్యారాణి, సబిత, తదితరులు పాల్గొన్నారు.



దుగ్గొండి : మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

మున్సిపాలిటీలో విలీన ప్రక్రియ అపసవ్యం



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : స్థానిక మున్సిపాలిటీలో గ్రామాల విలీన ప్రక్రియ అపసవ్యంగా ఉందని స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సంపేట మండలంలోని ఎంపీటీసీల డీలిమిటేషన్‌లో నిబంధనలు తుంగలో తొక్కి కాంగ్రెస్ పార్టీ సూచనల మేరకు అధికారులు వ్యవహరించారని తెలిపారు. ప్రజల భాగస్వామ్యం, ప్రతిపక్ష పార్టీలతో నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను బుట్టదాఖలు చేశారన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో పాత మగ్దుంపురం గ్రామ ప్రజల కోరిక మేరకే ప్రత్యేక గెజిట్ ద్వారా జీఓ విడుదల చేస్తూ చెన్నారావుపేటలో విలీనం చేశామని, ప్రస్తుత కాంగ్రెస్ నాయకులు గతంలో చెన్నారావుపేటలో అంతర్లీనంగా ఉన్న పాత మగ్దుంపురం గ్రామాన్ని చెన్నారావుపేట మండలానికి కలిపి గురజాల ఎంపీటీసీ పరిధిలోకి తీసుకురావడం ప్రజలకు నష్టం చేయడమేనని చెప్పారు. రాజుపేటను కలుపుతున్నామంటూ ఒకసారి, రద్దు చేస్తున్నామంటూ మరోసారి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారని చెప్పారు. రాజుపేటకు కేవలం కిలోమీటర్ దూరంలో ఉన్న ముత్తోజిపేటను విలీనం చేస్తున్నామంటూ నోటిఫికేషన్ విడుదల చేస్తూ మ్యాపింగ్ చేసిన క్రమంలో నర్సంపేట నుంచి ముత్తోజిపేటకు రవాణా మార్గం ఎలా ఉందో స్థానిక ఎమ్మెల్యే చెప్పాలని ప్రశ్నించారు. వేలాది ఎకరాల అసైన్డ్, ఇతర భూములపై కన్ను పడడం వల్లే కొన్ని గ్రామాలను నిబంధనలకు విరుద్ధంగా విలీనం చేశారని చెప్పారు. మున్సిపాలిటీలో ఏయే గ్రామాలను ఎందుకు కలిపారో?, నర్సంపేట మండలానికి ఏడు ఎంపీటీసీలను ఎలా నిర్ణయించారో చెప్పాలన్నారు. సమావేశంలో ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని కటౌట్‌కు క్షీరాభిషేకం



రాయపర్తి : మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ కటౌట్‌కు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు నూనె అనిల్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ అద్భుతమన్నారు. బడ్జెట్‌పై విపక్షాలు విమర్శలు మానుకోవాలని కోరారు. 2027 నాటికి అమెరికా, చైనా తర్వాత భారత్‌ను మూడో ఆర్థిక వ్యవస్థగా నిలిపే దిశగా బడ్జెట్ రూపొందించారని తెలిపారు. ప్రధాని మోదీకి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బూరుగు నవీన్, నాయకులు పెండ్యాల గణేశ్, మంచాల సుమన్, నిమ్మల అనిల్, మూనావత్ భద్రు, మందపురి రాజు, అశోక్, రాజశేఖర్, సురేశ్, రమేశ్, వెంకన్న, సందీప్, రాకేశ్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి..



పర్వతగిరి : మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. రాష్ట్రంలో సామాజిక న్యాయానికి ప్రతీకగా ప్రజాపాలన కొనసాగుతోందని చెప్పారు. సీఎం, మంత్రివర్గం ఎస్సీ వర్గీకరణను ఆమోదించడం, శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టేందుకు సిద్ధంగా ఉండడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్, కాంగ్రెస్ నాయకులు మాసాని యాకూబ్, బొట్ల మహేంద్ర, మాసాని సువార్త, బొట్ల కనకరాజు, బొట్ల వెంకన్న, రంగు జనార్దన్, జంగ సాంబయ్య, కొమ్ము రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదులో వివరాలు తప్పనిసరి

వర్ధన్నపేట : ప్రభుత్వం నిర్దేశించిన యాప్‌లో పంటల నమోదులో అవసరమైన అన్ని వివరాలు తప్పనిసరిగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) విజయ్‌కుమార్ చెప్పారు. పట్టణ శివారులోని పంట క్షేత్రాల్లో వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈఓ) చేపట్టిన పంటల నమోదు ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి పంట నమోదు చేయాలని చెప్పారు. రైతులు పూర్తి వివరాలు అందజేసి అధికారులకు సహకరించాలని సూచించారు. యాప్‌లో నమోదు చేసిన పంట ఉత్పత్తులు విక్రయించినపుడు రైతులు ఉపయోగం ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా ప్రభుత్వ పథకాలు, నష్టం, తదితర సందర్భాల్లోనూ పంటల నమోదు వివరాలు ఉపయోగపడతాయని చెప్పారు.



యాప్‌లో పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ

8న నిరసనలు జయప్రదం చేయాలి

- ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి రవి

నర్సంపేట రూరల్ : ఈనెల 8న తలపెట్టిన నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి కోరారు. మండలంలోని మాదన్నపేటలో వస్కుల మట్టయ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశానికి రవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బహుజన రాజ్యాధికారం ద్వారా మాత్రమే సమాజంలో దోపిడీ, అసమానతలు పోతాయని చెప్పారు. వర్గ, సామాజిక సిద్ధాంత ఆచరణ కోసం మార్క్స్, అంబేడ్కర్ మార్గమే శరణ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పేదలకు నష్టం చేస్తూ సంపన్నులకు ప్రయోజనాలు కలిగించేలా ఉందని ఆందోళన వెలిబుచ్చారు. బడ్జెట్‌ను తక్షణమే సవరించి ఆమోదించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వల్లెపు ఉపేందర్‌రెడ్డి, నాయకులు వనం సుధాకర్, గోనె కుమారస్వామి, కుంభం సుకన్య, వరికుప్పల వెంకన్న, పెద్దారపు రమేశ్, హంసారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవి

‘గ్రామాన్ని గురిజాల ఎంపీటీసీకి కలపొద్దు’

చెన్నారావుపేట : పాత మగ్దుంపురం గ్రామాన్ని గురిజాల ఎంపీటీసీకి కలుపొద్దని మాజీ సర్పంచ్ సుంకరి లావణ్య సాంబయ్య, ఉపసర్పంచ్ మేకల సదయ్య, బీఆర్‌ఎస్ నాయకులు సయ్యద్ బషీర్, పోలెపల్లి రమేశ్ డిమాండ్ చేశారు. గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పాత మగ్దుంపురంను నర్సంపేట మండలంలో కలిపిన క్రమంలో రెవెన్యూ, పోలీస్‌స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సేవలు చెన్నారావుపేట మండలంలో అందుతున్నాయని చెప్పారు. చెన్నారావుపేటలో రెండు ఎంపిటీసీ స్థానాలు చేసి పాత మగ్దుంపురంను చెన్నారావుపేట–2 ఎంపీటీసీకి కలిపితే ప్రయోజనం ఉంటుందన్నారు. సమావేశంలో ఆ పార్టీ మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నాంపెల్లి మల్లయ్య, నాయకులు నాంపెల్లి సమ్మయ్య, మైదం బాబు, అంకూస్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

‘లక్ష డప్పులు..’కు మద్దతు

రాయపర్తి : ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు.. వేల గొంతుల కార్యక్రమానికి మండలంలోని కేశవాపురం గ్రామానికి చెందిన ఎస్సీ, బీసీ నాయకులు మంగళవారం మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మొలుగూరి పున్నమయ్య మాట్లాడారు. సమాజాన్ని చైతన్యవంతం చేయడం అనాదిగా డప్పులు క్రియాశీలకంగా నిలుస్తున్నాయని చెప్పారు. గౌడ సంఘం మద్దతు పలుకుతోందని తెలిపారు. కార్యక్రమంలో సామాజిక ఉద్యమకారుడు చిలుముల కృష్ణ, వైశ్య కుల సంఘం నాయకుడు అనంతుల శ్రీనివాస్, యాదవ సంఘం నాయకులు పోలు అశోక్, కాసు కుమార్, కందుకూరి మధు, తూళ్ల భిక్షపతి, చిలుముల ఆర్యానంద్, చిలుముల యాకయ్య, చిలుముల రాజు, తదితరులు పాల్గొన్నారు.

విరాళం

సంగెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనానికి వరంగల్‌కు చెందిన సహస్ర ఫౌండేషన్ రూ.7 వేల విరాళం అందజేసింది. అధ్యాపకులు దాతల సహకారంతో కళాశాలలో విద్యార్థులకు గత డిసెంబర్ 19న మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం తెలుసుకుని ఫౌండేషన్ అధ్యక్షుడు పాత్తేపు ప్రవీణ్ కళాశాలకు చేరుకుని నగదు అందజేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కాక మాధవరావు. అధ్యాపకులు బండి విజయనిర్మల, మామిండ్ల బుచ్చిరెడ్డి, ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు పోలెబోయిన భరత్, సభ్యులు వడ్డూరి సాయి, మంద మణి, సింగం శివ, నాయిని వినయ్, తదితరులు పాల్గొన్నారు.

నివాళి




నర్సంపేట : పట్టణానికి చెందిన రుద్ర లింగమూర్తి మంగళవారం మృతి చెందగా ఆయన మృతదేహానికి స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు రుద్ర ఓంప్రకాశ్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, మాజీ కౌన్సిలర్లు నాగిశెట్టి ప్రసాద్, మహ్మద్ పాషా, బండి రమేశ్, నాయకులు మద్దెల సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన పుల్లూరి ఎల్లమ్మ మంగళవారం మృతి చెందగా ఆమె మృతదేహానికి కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె సమీప బంధువైన యూత్ కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు పుల్లూరి దిలీప్ గౌడ్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్, నాయకులు శాంతిరతన్‌రావు, భాస్కర్‌నాయక్, బిల్‌నాయక్, అబ్రపురి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

సంగెం : మండలంలోని ఆశాలపల్లికి చెందిన పంతంగి రాజు ఇటీవల తాటిచెట్టుపై విద్యుదాఘాతానికి గురై మృతి చెందగా బాధిత కుటుంబానికి మండల కౌండిన్య పరపతి సంఘం నుంచి మంగళవారం రూ.10 వేల సాయం అందజేశారు. తొలుత బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గుళ్లపల్లి ఉమేందర్, పూజారి గోవర్దన్, మచ్చ వెంకన్న, దొమ్మాటి దర్శనం, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

‘మార్చిలో బహుజనులతో పార్టీ ఏర్పాటు’



నర్సంపేట : మార్చిలో బహుజనులతో రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తామని అడహక్ కమిటీ కన్వీనర్ జన్ను సాంబయ్య తెలిపారు. పట్టణంలో మంగళవారం అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. కోకన్వీనరుల్లుగా బుర్రి సాగర్, అంకేశ్వరపు రమేశ్, మాదాసి భిక్షపతి, లావుడ్య మధుకర్, శ్రీరాముల పైడి, ఎడ్ల రవి, తనుగుల శ్రీకాంత్, రామచంద్రు, నక్క భిక్షపతి, పాలెపాక అరుణ్‌కుమార్, కంగర సూర్యారావు, బుర్రి కుమారస్వామి, పీసరి రజిత, బాణాల మరియ, బర్రి సాంబలక్ష్మి, బొటికె మానిక ఎన్నికయ్యారు. అనంతరం సాంబయ్య మాట్లాడారు. హైదరాబాద్‌లో రాజకీయ పార్టీ ఏర్పాటు, అజెండా ప్రకటిస్తామని చెప్పారు. బహుజనులకు రాజకీయ పార్టీ ఉండాలని ఆకాంక్షించారు.

కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగంపై నిర్లక్ష్యం

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్

వర్ధన్నపేట : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగంపై నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ విమర్శించారు. ఆ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడారు. బడ్జెట్‌లో ప్రభుత్వ విద్యారంగానికి అవసరమైన మేరకు నిధులు కేటాయించలేదని చెప్పారు. ప్రభుత్వం విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసేలా ప్రైవేటీకరణకు కుట్ర చేస్తోందని ఆందోళన వెలిబుచ్చారు. ఇప్పటికే దేశంలో పాఠశాల విద్యను నిధుల కొరత వేధిస్తుండగా కేంద్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో రూ.1.28 లక్షల కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.78 వేల 572 కోట్లు కేటాయించిందని తెలిపారు. విద్యారంగానికి అరకొరగా నిధులు కేటాయించడం పేదలను చదువులకు దూరం చేసేలా ఉందన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి విద్యారంగానికి రూ.1.28 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మోసపూరిత విధానాలను తిప్పికొట్టేలా విద్యార్థులకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేసి పోరాటాల దిశగా నడిపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి ఇస్లావత్ కల్యాణ్, నాయకులు శివసాయి, రాంచరణ్, అఖిల్, వంశీ, సాంబరాజు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ప్రశాంత్, నాయకులు

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోండి

నర్సంపేట : మండలం దాసరిపల్లి శివారులో కమ్మపల్లికి చెందిన కొందరు తలపెట్టిన చర్చ్ అక్రమ నిర్మాణంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు ఆర్డీఓ ఉమారాణి, తహసీల్దార్ రాజేశ్‌లకు మంగళవారం వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడారు. గ్రామపంచాయతీ అనుమతి లేకుండా నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి నోటీసులు అందజేసినా, పోలీసులకు ఫిర్యాదు చేసినా నిర్వాహకులు నిర్మాణం కొనసాగిస్తున్నారని చెప్పారు. ఇకనైనా అధికారులు స్పందించి చర్చ్ నిర్మాణ పనులు నిలిపేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రాలు అందజేసిన వారిలో గ్రామస్తులు దాసరి రాజిరెడ్డి, తోటకూరి ఐలయ్య యాదవ్, వల్లాల శేఖరయ్య, తుమ్మ నాగయ్య, కొక్కరకొండ బీరప్ప, తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

- జెండర్ స్పెషలిస్ట్ రమాదేవి

నల్లబెల్లి : బాలికలు ఆత్మస్థైర్యంలో జీవితంలో ముందుకు సాగాలని ప్రముఖ జెండర్ స్పెషలిస్ట్ రమాదేవి ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో ‘బేటీ బచావో–బేటీ పడావో’ పథకంపై మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలికలకు చదవు ప్రాముఖ్యత, మొబైల్ వినియోగం, సోషల్ మీడియా దుష్ప్రభావం, లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు, బాలల అక్రమ రవాణా, తదితరాలపై వివరించారు. ఆపద సమయంలో డయల్ 100, 1098, 181, 112, 14567, 155326, 1930 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం అందించి రక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ సునీత, ఉపాధ్యాయులు జ్యోతి, శ్రీమత, జమున రాణి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న రమాదేవి, తదితరులు

మాజీ సర్పంచ్‌ల అరెస్ట్, విడుదల

దుగ్గొండి : అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మండలానికి చెందిన మాజీ సర్పంచ్‌లు ఓడేటి తిరుపతిరెడ్డి, మోడెం విద్యాసాగర్, రేవూరి సురేందర్‌రెడ్డిలను ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సోమవారం అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం మధ్యాహ్నం వ్యక్తిగత పూచికత్తుపై వదిలిపెట్టారు.

సంగెం : మండలానికి చెందిన సర్పంచ్‌ల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు పూలుగు సాగర్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు గుండేటి బాబు, మాజీ సర్పంచ్‌ల భర్తలు దొనికెల శ్రీనివాస్, ఇజ్జగిరి అశోక్‌లను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై వదిలేశారు. ఈ సందర్భంగా సాగర్‌రెడ్డి మాట్లాడారు. అరెస్టులు సరికాదన్నారు. మాజీ సర్పంచ్‌లకు రావాల్సిన బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



దుగ్గొండి : పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు